అంగనవాడీ పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలి

విశాలాంధ్ర - జలుమూరు : అంగనవాడి కేంద్రాల్లో చదువుతున్న పిల్లలకు మంచి పోషక ఆహారం అందించి వారిలో ఆరోగ్యాన్ని పెంపొందించే విధంగా చూడవలసిన బాధ్యత ఉందని మండల అభివృద్ధి అధికారి కొమరాపు అప్పలనాయుడు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జలుమూరు బాలిక ఉన్నత పాఠశాలలో జరిగిన అంగన్వాడీ కార్యకర్తల ప్రత్యేక శిక్షణ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పిల్లల్లో పౌష్టికాహారాన్ని మరింత పెంపొందించాలని క్రమశిక్షణతో ఆరోగ్య సూత్రాలు పాటించే విధంగా నేర్పాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో తహశీల్దారు జన్ని రామారావు, మండల విద్యాశాఖ అధికారి బమ్మిడి మాధవరావు, ప్రధానోపాధ్యాయులు ఇప్పిలి వేణుగోపాలరావు పలువురు పాల్గొన్నారు.

మంత్రులను విమర్శించే హక్కు నీకుందా..

విశాలాంధ్ర - టెక్కలి : రాష్ట్ర ముఖ్యమంత్రికి, మంత్రులకు విమర్శించే హక్కు నీకులేదని నందిగాం మండల టిడిపి అధ్యక్షులు పినకాన అజయ్ కుమార్ అన్నారు. మంగళవారం టెక్కలి టిడిపి కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. సోమవారం పేరాడ తిలక్ ఇచ్చిన ప్రెస్ మీట్ కు సమాధానంగా పినకాన అజయ్ కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు, అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు మీద విమర్శించే అర్హత నీకులేదుని మండిపడ్డారు. వల్లభనేని వంశీ అక్రమ అరెస్టు అంటున్నావ్.. నువ్వు, గత ప్రభుత్వంలో చిన్న చిన్న కార్యకర్తలకి అక్రమంగా అరెస్టు చేసినప్పుడు నువ్వు ఏమైపోయావ్ అని తిలక్ ప్రశ్నించారు. జిల్లాలో అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు, కింజరాపు కుటుంబం చరిత్ర గురించి నీకు ఏం తెలుసని నేడు మాటలాడుతున్నావని, 7వ తరగతి 7 సార్లు పోయిన నీకు ఏమి తెలుస్తుందని అన్నారు. ఈ జిల్లాలో కింజరాపు కుటుంబం అవినీతిపరులని నిరూపిస్తే టిడిపి పార్టీ నాయకులు రాజకీయ సన్యాసం తీసుకోడానికి కూడ సిద్ధంగా ఉన్నామన్నారు. నియోజకవర్గంలో కక్ష సాధింపు చర్యలు పాల్పడితే.. మొదట ఈ నియోజకవర్గంలో అవినీతిపరులు, భూ కబ్జా చేసిన వ్యక్తి,చెరువుల ఆక్రమించే వ్యక్తి, బంజీరు భూములు ఆక్రమించే వ్యక్తి,వంశధారలో అనేక విధాలుగా ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేసిన వ్యక్తి నువ్వేనని అది ముందు గుర్తు తెచ్చుకో అని అన్నారు. మంత్రులు చేసిన అభివృద్ధిని చూసి వార్వలేక తప్పుడు ఆరోపణలు చెయ్యడం తప్ప గత 5 సవంత్సరాలు నువ్వు ఏమైనా పని చేసేవా అని ప్రశ్నించారు. గత ఐదు సంవత్సరాలలో వంశధారలో ఎన్ని అక్రమాలు చేశారో... అవన్నీ నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసని అన్నారు. మిల్లర్స్ సంఘం అధ్యక్షునిగా బోయిన రమేష్ ని మేము పెట్టామని అంటున్నావు కానీ ప్రజాస్వామ్యబద్ధంగా మిల్లర్స్ అందరూ కలిసి ఒక మంచి వ్యక్తి ని ఎన్నుకున్నారని నువ్వు తెలుసుకోలేని పరిస్థితుల్లో ఉన్నావని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్టోన్ క్రసర్, మైన్స్ లో అక్రమాలు జరుగుతున్నాయని, క్రసర్లు అన్ని ఆపేశారని మాట్లాడుతున్నావు కదా నువ్వు... మరి అలా అయితే నీ సొంత క్రసర్ ని కూడ ఆపించేవాళ్ళం కదా... అని అన్నారు. తిలక్ నీకు పనులు కావాలంటే చెప్పు అచ్చెన్నాయుడు కి చెప్పి పనులు ఇప్పిస్తాం, పనులు చేసుకో వచ్చిన కమిషన్ నువ్వే తీసుకో... బ్రతుకు అని అన్నారు. కింజరాపు అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు నియోజకవర్గంలో కొన్ని వందల కోట్ల రూపాయలతో రోడ్ పనులు చేయిస్తున్నారు. అవన్నీ చూసి నువ్వు ఓర్చుకోలేక తప్పుడు కూతలు కుయ్యడం సరికాదని, ఇంకా ఇలా తప్పుడు ఆరోపణలు చేస్తే ఇప్పటికె నీకు రెండు సార్లు ప్రజల చేతులో చెప్పు దెబ్బలు తిన్నావని, మల్లి చెప్పు దెబ్బలు తినే రోజులు దగ్గరలోనే ఉంటాయని జాగ్రత్త.. ఖబద్దార్....అని అన్నారు. ఈ కార్యక్రమం టెక్కలి మండల అధ్యక్షులు బగాది శేషగిరి రావు, హనుమంతు రామకృష్ణ, కోళ్ల లవకుమార్, పోలాకి చంద్రశేఖర్, దల్లి ప్రసాద్ రెడ్డి, ముదిలి సింహాచలం, కరుకోల లక్ష్మణ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిజేబుల్ పిల్లలను డీఈఐసీ కేంద్రానికి తరలింపు

విశాలాంధ్ర - టెక్కలి : ఏపీ స్టేట్ లీగల్ అథారిటీ చైర్మన్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం 0 నుండి 18 సంవత్సరాల లోపు డిజేబుల్ పిల్లలను గుర్తించేందుకు మంగళవారం మండలంలో స్థానిక ఎంజెపి బాలికల పాఠశాలలో ప్రిన్సిపాల్ పి.సుధారాణి ఆధ్వర్యంలో సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా కొంతమంది డిజేబుల్ పిల్లని గుర్తించి డిఈఐసి కేంద్రానికి ప్రభుత్వం కేటాయించిన వాహనంలో తరలించినట్లు ఏఎన్ఎం పాపాయమ్మ, హెచ్ ఎ.చంద్రశేఖర్ తెలిపారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించండి

విశాలాంధ్ర - టెక్కలి : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలని పిడిఎఫ్ అభ్యర్థి కొర్లాడ విజయ్ గౌరీ కోరారు. ఈ సందర్భంగా మండలంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవంఁణంలో మంగళవారం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుత విద్యావ్యవస్థలో ఉన్న పది రకాల మేనేజ్మెంట్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల యొక్క సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పోరాట స్ఫూర్తితో ఉపాధ్యాయ హక్కుల సాధనకు విద్యారంగ పరిరక్షణకు పాటుపడతానని తెలియజేస్తూ ఈ ఎన్నికలలో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి విజ్ఞానులైన ఉపాధ్యాయ ఓటర్లు తోటి ఉపాధ్యాయులకు చెప్పి ఎమ్మెల్సీ ప్రాధాన్యతను తెలియజేయాలని ఆమె కోరారు. ఉపాధ్యాయ ఓటర్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఫార్మా రిజిస్ట్రేషన్ తప్పనిసరి ఏవో గాయత్రి...

విశాలాంధ్ర - హిరమండలం : మండలం లోని రైతులు అంతా ఎక్కడో ఒక దగ్గర ఫార్మా రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిని ఎస్ గాయత్రి మంగళవారం విలేకరుల కు తెలిపారు.. మంగళవారం మండలం లోని ఫింద్రు వాడ రైతు భరోసా కేంద్ర పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతులు తో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో గాయత్రి మాట్లాడు తూ ప్రతీ ఒక్క రైతు కు ఐడెంటికార్డు ఉండాలని ఏపీ యఫ్ ఆర్ లో భాగంగా ఎ రైతు భరోసా కేంద్రం లో నైనా యూనిక్ ఐడెంట్ కార్డు పొందాలని పత్రికా ముఖం గా కోరామన్నారు.. ప్రతి రైతు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, మొబైల్ ఫోన్ ఈ మూడు తీసుకొని వచ్చి రైతు భరోసా కేంద్రాల్లో ఫార్మా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు ఆర్ బి కే అసిస్టెంట్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘ సభ్యులకు వ్యక్తిగత రుణాలు

యూనియన్ బ్యాంకు మేనేజర్ విద్యాధరరావు

విశాలాంధ్ర - మందస : పంచ సూత్రాలు పాటిస్తున్న మహిళా స్వయం శక్తి సంఘ సభ్యులకు పొదుపు ఖాతా నుంచి అప్పులు, గ్రూపు రుణాలతో పాటు తక్కువ వడ్డీకే వ్యక్తిగత రుణాలను కూడా మంజూరు చేస్తున్నట్లు మందస యూనియన్ బ్యాంక్ మేనేజర్ విద్యాధరరావు తెలిపారు. సంఘాలను గుర్తించి వారు చేపడుతున్న కార్యకలాపాలను ఆధారంగా చేసుకుని రుణాలను మంజూరు చేస్తున్నట్లు వివరించారు. మంగళవారం స్థానిక అమ్మవారి గుడి వద్ద వెలుగు ఏ.పి.ఎం. పైడి కూర్మా రావు ఆధ్వర్యంలో నిర్వహించిన స్వయం శక్తి సంఘాల అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి సంఘం కూడా వారి సేవింగ్ ఖాతా నుంచి సంఘం తీర్మానం ప్రకారం ఎప్పుడైనా సంఘ సభ్యులకు అప్పులు ఇచ్చుకునే నిమిత్తం విత్ డ్రా చేసుకోవచ్చని దానికి బ్యాంకు వారి అభ్యంతరం ఉండకూడదని వివరించారు. కొత్తగా ఏర్పడిన స్వయం శక్తి సంఘాలతో పాటు, పాత స్వయం శక్తి సంఘాలను కూడా సంఘ సభ్యుల ఆమోదము తీర్మానం మేరకు మీ సంఘం సీనియార్టీ కి భంగం లేకుండా టేక్ ఓవర్ కూడా చేసుకుంటామని సంఘ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం ప్రతినిధులతో పాటు క్లస్టర్ కోఆర్డినేటర్లు స్వామి నాయుడు, తారక మోహన్, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు, స్థానిక వివోఏలు నీరజ, శారద, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు పాటుపడతా...

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే విద్యారంగ పరిరక్షణకు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పాటు పడతానని పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరీ తెలిపారు. కోటబొమ్మాలి సంతబొమ్మాలి మండలాల్లో పలు పాఠశాలలను మంగళవారం సందర్శించిన ఆమె అక్కడి ఉపాధ్యాయులతో ఆత్మీయంగా కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేసి గెలిపించాలని కోరారు. కోటబొమ్మళి జడ్పీ ఉన్నత పాఠశాల, సంతబొమ్మాలి మండలం జగన్నాధపురం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో ఆమె మాట్లాడుతూ ప్రస్తుత విద్యావ్యవస్థలో ఉన్న పది రకాల మేనేజ్మెంట్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల యొక్క సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత కాలంలో పనిచేసిన పీడీఎఫ్ ఎమ్మెల్సీల పోరాట స్ఫూర్తితో మీ వెన్నంటి ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో యు టిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. కిషోర్ కుమార్, జిల్లా సహాధ్యక్షులు కె.దాలయ్య, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ డి.గణపతిరావు, జిల్లా అకాడమిక్ సెల్ కో కన్వీనర్ బి.రాజు, మండల అధ్యక్షులు కె.పాపారావు, సీనియర్ నాయకులు ధర్మారావు, వైకుంఠరావు తదితర రెండుమండలాల యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : మండలం నువ్వలరేవు గ్రామానికి చెందిన బెహరా ధర్మారావు (30), బెహరా సన్న (34)లు సోమవారం అర్ధరాత్రి కంచిలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతులిద్దరు కంచిలిలో ఒక వస్త్ర దుఖాణంలో బట్టలు కొనుగోలు చేశారు. అక్కడ నుంచి తిరిగి వస్తుండగా కంచిలి సమీపంలో జాతీయ రహదారిపై లారీ ఢీ కొనడంతో ధర్మారావు, సన్న ఇద్దరు. అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబీకులు, గ్రామస్తులు అంత్యక్రియులు నిర్వహిం చారు. వీరి మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

జ్ఞాన జ్యోతిపై అంగన్వాడి కార్యకర్తలకు శిక్షణ

విశాలాంధ్ర - టెక్కలి : మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్వాడి కార్యకర్తలకు మంగళవారం మండల విద్యాశాఖ అధికారి, సీడీపీఓ శోభారాణి ఆధ్వర్యంలో జ్ఞాన జ్యోతి కార్యక్రమం పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు ప్రీ ప్రైమరీ స్కూల్లో బోధించడానికి జ్ఞాన జ్యోతి 120 రోజుల శిక్షణ సర్టిఫికెట్ కోర్స్ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు అందరికీ విద్యాశాఖ ఆధ్వర్యంలో 18,19,20, 22, 24,25 తేదీలలో ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ తిరుమల చైతన్య ఈ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను, అంగన్వాడిను బలోపేతం చేయడానికి ఈ శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. జాతీయ విద్యా విధానం 20 25 బాల్య సంరక్షణ, విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఈ శిక్షణ ద్వారా అంగన్వాడి కార్యకర్తల సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యమన్నారు. శిక్షణ కార్యక్రమాలపై పలు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 1 తులసీరావు, ఎంఈఓ 2 చిన్నారావు, డిఆర్పిలు, ఐసీడీఎస్ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్ స్కాలర్‌కు ఐతమ్ విద్యార్థి ఎంపిక

విశాలాంధ్ర - టెక్కలి : ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో సిఎస్ఈ మొదటి ఏడాది బిటెక్ కోర్సు చదువుతున్న ఎ.హేమలత ఇన్ఫోసిస్ ఫౌండేషన్ స్టెమ్ స్టార్స్ స్కాలర్షిప్కు ఎంపికైందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వివి. నాగేశ్వరరావు మంగళ వారం ఒక ప్రకట నలో తెలిపారు. ఏడాదికి రూ.లక్ష చొప్పున నాలుగేళ్లలో రూ.4 లక్షల ఉపకార వేతనం ఆ విద్యార్థి పొందుతుందని డైరెక్టర్ పేర్కొన్నారు. పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో పొందిన మార్కులు, ఆర్థిక స్థోమత, ప్రతిభ ఆధారంగా ఇన్ఫోసిస్ హేమలతకు ఈ స్కాలర్కు ఎంపిక చేసింద న్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ వివి. నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సిఎస్ఈహెచ్‌డి డాక్టర్ వై.రమేష్, అసిస్టెంట్ హెచ్‌డి డాక్టర్ టి.చలపతిరావు, శాక్ ఇన్చార్జ్ జాకా సురేష్కుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు హేమలతను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వికలాంగుడు మృతి

విశాలాంధ్ర - మందస : మండలం కొత్త పల్లి పంచాయతీ ముకుందపురం రోడ్డు సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మందస హార్టిజన్ కాంప్లెక్సుకు చెందిన వికలాంగుడు తామాడ జయరాం (40) మృతి చెందారు. మృతుని భార్య తామాడ కున్నికి స్వల్ప గాయలు తగిలాయి. భార్య భర్త లిద్దరూ సోంపేట నుంచి మూడు చక్రాలు వాహనంపై మందస వస్తుండగా ముకుందపురం గ్రామం వద్ద రోడ్డు కు అడ్డంగా వచ్చిన ఎలుగు బంటిని తప్పించబోయి వాహనం బోల్తా పడింది. ఈ సంఘటనలో వికలాంగుడు తామాడ జయరాం అక్కడికక్కడే మృతి చెందాడు. యువకుడైన తామాడ జయరాం పుట్టినప్పటి నుంచి అంగవైకల్యం అనుభవిస్తున్నారు. అంగ వైకల్యంతో నడవలేకపోవడంతో 10 ఏళ్ల క్రిందట ప్రభుత్వం మూడు చక్రాల వాహనాన్ని మంజూరు చేసింది.విశ్వ కర్మ కులానికి చెందిన మృతుడు జయరాం కుల వృత్తి అయిన కార్పెంటరీ పనులుకు కూలి నిమిత్తం వెళు కుటుంబ జీవనాన్ని గడుపుతున్నారు. వికలాంగుడు తామాడ జయరాం మరణించడంతో కుటుంబం జీవనోపాధి కోల్పోయారు. రోడ్డు ప్రమాదంలో మరణించడంతో కుటుంబ సభ్యులు తల్లి దండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరు అయి రోదిస్తున్నారు.

'జ్ఞానజ్యోతి' ప్రాధమిక స్థాయి శిక్షణలో పాల్గొన్న అంగన్వాడీలు

విశాలాంధ్ర - నరసన్నపేట : మండలంలోని అంగన్వాడీ కేంద్రాలకు చెందిన 118 మంది అంగన్వాడీ మహిళలు మంగళవారం జ్ఞాన జ్యోతి ప్రాధమిక స్థాయి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. సుమారు 120 రోజుల పాటు సర్టిఫికేట్ కోర్సు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారులు-1,2 పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం.ఈ.ఓ-1, ఉప్పాడ శాంతారావు మాట్లా డుతూ అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పాఠశాల విద్య పట్ల అవగాహన కల్పిస్తూ, పిపి-1, పిపి-2 బోధించాలని తెలిపారు. అలాగే అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా వారి తల్లితండ్రులతో మాట్లాడి, ప్రభుత్వ బదుల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నూతన విద్యా విధానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ప్రకారం ప్రైవైటు పాఠశాలల్లో సాధ్యమైనంత వరకూ చిన్నారులను చేర్పించకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. విడతలు వారీగా నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎం.ఈ.ఓ-2, దాలినాయుడు, సిడిపిఓ, నాగమణి, ఐసిడియస్ సూపర్వైజర్లు, విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.

రైతుల మేలు కోసం పైడిగాం అభివృద్ధి చేయాలి

ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్

విశాలాంధ్ర - సోంపేట : రైతులకు మేలు జరగాలంటే పైడిగాం సాగునీటి ప్రాజెక్టును మరింతగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని నీటి పారుదల శాఖ ఇంజనీర్లను ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ సూచించారు. సోంపేట, కంచిలి మండలాల్లో సుమారు 5వేల ఎకరాల భూములకు ప్రధాన సాగు నీరు అందించే పైడిగాం ప్రాజెక్టు గత ఐదేళ్లలో నిర్లక్ష్యానికి గురైందని, అభివృద్ధికి తగు ప్రణాళికలు, ప్రతిపాదనలు రూపొందించి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అభివృద్ధి జరిగేలా చూడాలని ఆదేశించారు. దీంతో పాటు కంచిలి, ఇచ్ఛాపురం మండలాల్లో సాగునీటి ఛానెల్స్‌ను అభివృద్ధి చేయాలని, కంచిలి మండలంలో గంగాసాగరంను మినీ రిజర్వాయర్‌గా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఇరిగేషన్ శాఖ ఇంజనీర్ రామ్‌గోపాల్, సూపరింటెండెంట్ ఇంజనీర్ కృష్ణారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డీఈ, జేఈలతో సోంపేట, కంచిలి మండలాల రైతులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి పైడిగాం ప్రాజెక్టును మంగళ వారం పరిశీలించారు. ఇదిలా ఉండగా సోంపేట, కంచిలి మండలాల రైతాంగానికి సాగునీరు సక్రమంగా అందాలంటే మినీ రిజర్వాయర్ నిర్మాణానికి తగు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులు మినీ రిజర్వాయర్ నిర్మాణంపై ఒత్తిడి చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మద్దిల నాగేశ్వరరావు, కొర్లాం సర్పంచ్ ప్రతినిధి రాంబుడ్డి గణపతి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాండం తొలిచే పురుగు నివారణకు బ్రహ్మాస్త్రం

విశాలాంధ్ర - నందిగాం : కూరగాయలలో కాండం తొలిచే పురుగు నివారణకు పకృతితో తయారు చేసే బ్రహ్మాస్త్రం ఎంతగానో ఉపయోగపడుతుందని పకృతి వ్యవసాయ సిబ్బంది ఇన్చార్జి లోకేష్ అన్నారు. మండలం శివరాంపురంలో మంగళవారం మహిళా సంఘం సభ్యులు సమక్షంలో బ్రహ్మాస్త్రం అనే కషాయాన్ని తయారు చేశారు.

శ్రీముఖలింగం ఉండి ఆదాయం రూ. 3,33,634

విశాలాంధ్ర - జలుమూరు : ప్రముఖ పుణ్యక్షేత్రం జలుమూరు మండలం శ్రీముఖలింగంలో కొలువైన శ్రీ మధుకేశ్వర స్వామి హుండీ లెక్కింపు మంగళవారం మధ్యాహ్నం జరిగిందని కార్యనిర్వాహన అధికారి ప్రభాకర్ తెలిపారు. 84 రోజులుగా 3,33634 రూపాయలు ఆదాయం లభించిందని ఆయన తెలిపారు. దేవాదాయ శాఖ సిబ్బంది ఆలయ అర్చకులు సత్యసాయి సభ్యులు స్థానికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

- అబార్షన్లకు గల కారణాలు సేకరించాలి

- జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.బాల మురళీకృష్ణ

విశాలాంధ్ర - శ్రీకాకుళం : జిల్లాలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు జరిపిన పిదప వివరాలు వెల్లడించడం చట్టరీత్యా నేరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.బాల మురళీ కృష్ణ పేర్కొన్నారు. అటువంటి స్కానింగ్ సెంటర్లపై, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా సెంటర్ల లైసెన్స్ లను రద్దుచేయడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. గర్భస్థ శిశు స్థితిగతులు, సమస్యలు తెలుసుకునేందుకే స్కానింగులు చేయాలే తప్పా, వీటిని ఆసరాగా తీసుకుని గర్భస్థ శిశు వివరాలు వెల్లడించడం నేరమన్నారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలు మేరకు గర్భస్థ శిశు లింగ నిర్ధారణ (పి.సి.పి.ఎన్.డి.టి) చట్టం అమలుపై కెపాసిటీ బిల్డింగ్ శిక్షణా సమావేశం ఆమె అధ్యక్షతన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సమావేశమందిరంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి మాట్లాడుతూ జిల్లాలో 108 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని, ప్రతి స్కానింగ్ సెంటరులో సీసీ కెమెరాల ఏర్పాటుచేయడంతో పాటు ఆయా కేంద్రాలపై ప్రోగ్రాం అధికారుల ద్వారా ఎప్పటికపుడు తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. ఇకపై ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో జరిగే అబార్షన్ల వివరాలతో పాటు అందుకు తగిన కారణాలను తమకు సమర్పించాలని స్పష్టం చేశారు. సమాజంలో బాల బాలికలిద్దరూ సమానమేనని, స్త్రీల పట్ల వివక్ష ఉండరాదని వివరించారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమనే కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని, బాలికల పట్ల వివక్ష లేకుండా సమాజంలో చైతన్యం తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో వెంకటేశ్వరరావు, హెల్త్ ఎడ్యుకేటర్స్ ఎస్. సూర్యకళ, హెల్త్ ఎడ్యుకేటర్స్ మోహిని మాట్లాడుతూ గర్భస్థ శిశు లింగ నిర్ధారణపై గ్రామ స్థాయి నుండి అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమాజంలో స్త్రీల నిష్పత్తి తక్కువగా ఉండ దానికి కారణం ఆడపిల్లల జననాలు తగ్గడమేనని స్పష్టం చేశారు. ఆడ, మగ తెలుసుకోవడానికి లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం తప్పన్నారు. శారీరకంగా, మానసికంగా సిద్ధం ఉన్నప్పుడే వివాహాలు చేయాలని ఆయన వివరించారు. పిపిటి ద్వారా పిసిపిఎన్‌డిటి యాక్ట్‌పై ప్రెసెంటేషన్ పాటు స్కాన్ సెంటర్స్ టెక్నీషియన్స్ సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ సమావేశంలో డిఐఓ రాందాస్, అదనపు జిల్లా వైద ఆరోగ్య శాఖ అధికారి తాడేలా శ్రీకాంత్, టెక్కలి డిప్యూటీ డా మెరీ కుమారి, డా ఆర్ శ్రీనివాస రావు, ఎపియామలాజిస్ట్ డా పి.సుజాత, పేరామెడికల్ ఆఫీసర్ వాన సురేష్, ప్రభుత్వం, ప్రయివేటు స్కాన్ సెంటర్ల వైద్యాధికారులు, డేటాఎంట్రీ ఆపరేటర్లు, డిప్యూటీ డెమో వెంకటేశ్వరరావు, హెల్త్ ఎడ్యుకేటర్స్ మోహిని, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసులనాయుడుని గెలిపించుకుందాం

విశాలాంధ్ర - కవిటి : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి సభ్యునిగా మిత్ర సంఘాల ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న గాదె శ్రీనివాసుల నాయుడుకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలింపించాలని ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి ఉపాధ్యాయులను కోరారు. ఈ మేరకు కవిటి మండలంలో పలు పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. పాత పెన్షన్ పునరుద్ధరణ, ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధించడం, 12వ పీఆర్సీ నియామకం, మధ్యంతర భృతి సాధన, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు సాధనే లక్ష్యంగా పోటీస్తున్న మన అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీ బాధ్యులు నగిరి శరత్, జిల్లా అధ్యక్షులు బల్లెడ రవి, రాష్ట్ర సహాధ్యక్షులు చింతాడ దిలీప్ కుమార్, కవిటి మండల గౌరవ అధ్యక్షులు కె.రంగారావు, అధ్యక్ష, కార్యదర్శులు బి.ధర్మారావు, వంశీ, ఎం.గోపి, శ్రీరామమూర్తి బి.సాయి పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రారు కార్యాలయం పేరుతో అక్రమ వసూళ్లు..?

విశాలాంధ్ర - పలాస/మందస : మందస మండల కేంద్రంలో కొంతమంది దస్తావేజు లేఖర్లు కొంతమందిని దళారులుగా నియమించుకొని చేస్తున్న దందాలు రోజురోజుకు ఎక్కువ అవుతోందని ఆరోపణ వినిపిస్తున్నాయి . దళారులు కొంతమంది దస్తావేజు లేఖరులు కలసి సుమారు 15 మంది సిండికేట్ గా ఏర్పడి సబ్ రిజిస్ట్రారు కార్యాలయానికి రోజు వారి వివిధ వనులు కోసం వచ్చే క్రయ విక్రయ దారులు నుంచి సబ్ రిజిస్ట్రారు కార్యాలయం పేరుతో వేలాది రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నారని తెలుస్తోంది. ఒక్కొక్కరు రోజుకు సుమారు పది వేల రూపాయలు వరకు ఆర్జిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ముఠా చర్యలకు ఇక్కడ అడ్డు కట్ట లేకుండా పోయింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మందస సబ్ రిజిస్ట్రారు కార్యాలయంపై అంతస్తులో అద్దె కొంపలో దశాబ్దాలు తరబడి నడుపు తున్నారు. ఈ కార్యాలయంలో, మరుగు దొడ్లు లేవు.క్రయ విక్రయ దారులు పైఅంతస్తుకు వెళ్లాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ రిజిస్ట్రేషన్లు కోసం వృద్దులు, మంచం పట్టిన అనారోగ్యం పాలయిన వ్యక్తులను కూలీలు ద్వారా పైకి మోయించి పై అంతస్తులో ఉన్న సబ్ రిజిస్ట్రారు కార్యాలయానికి చేర వేస్తుండడం ఇక్కడ ఆనవాయితీగా మారింది.జిల్లాలో ఎక్కడ కూడా పై అంతస్తులో ఇటువంటి కార్యాలయం లేదు. నిఘా అధికారుల నుంచి తప్పించు కునే ప్రయత్నంలో భాగంగా కార్యాలయాన్ని పై అంతస్తులోనే కొన సాగించడానికి మొగ్గు చూపుతున్నారు.ఇలా ఇక్కడ కార్యాలయం కొనసాగడానికి రాజకీయ పలుకు బడి ఉన్న దస్తావేజు లేఖర్ల అండదండలు ఉన్నాయని తెలుస్తోంది. ప్రస్తుతం అద్దె కొంపలో నడుపుతున్న కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. కార్యాలయానికి రక్షణ గోడలు లేవు. నిబంధనలకు భిన్నంగా దస్తావేజు లేఖర్ల కార్యాలయాలు సబ్ రిజిస్ట్రారు కార్యాలయం కింద భాగ్గాన ఉన్నాయి. మద్యం దుఖాణం కూడా ఇక్కడే వుండడం దారుణం. దస్తావేజు లేఖర్ల సముదాయాలు 500 మీటర్ల దూరంలో ఉండాలి. కానీ లేఖర్ల సము దాయాలు, దళారుల ముఠాలు ఇక్కడే ఉంటారు. ఇక పోతే సబ్ రిజిస్ట్రారు కార్యాలయం ద్వారా ప్రజలు పొందే పౌరసేవలు తో పాటు క్రయ విక్రయాలు అన్ని ఆన్ లైన్‌లో జరగాలి. కానీ అన్ లైన్‌లో జరిగే ఈ వనులన్నిటినీ కార్యాలయం చుట్టూ ఉన్న దస్తావేజు లెఖర్లు, మధ్య దళారులే చేయిస్తుండడం విశేషం. ప్రభుత్వ నిబంధనల ప్రకారము రిజిస్ట్రేషన్ చార్జీలు కన్న సబ్ రిజిస్ట్రారు కార్యాలయం పేరుతో 10 రెట్లు అదనంగా లేఖర్లు, దళారులు కలసి క్రయ విక్రయ దారులు నుంచి వసూళ్లు చేస్తుంటారు. ఈ విషయం కార్యాలయం ఉద్యోగులకు తెలిసినా పట్టించుకోకుండా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్త న్నాయి. ఆన్ లైన్ సేవలు పట్ల ప్రజలకు అవగాహన లోపం లేకపోవడంతో రోజులు తరబడి కార్యాలయం చుట్టూ తిరిగ లేక లేఖర్లు, దళారులను ఆశ్రయిస్తున్నారు. క్రయ విక్రయ దారులను లేఖర్లు, దళారులు పక్క దారి పట్టించే చర్యలకు పాల్పడుతున్నారు .దీనితో పాటు అక్రమ రిజిస్ట్రేషన్ల కోసం పంచాయతీ కార్యదర్శులు ,తహసీల్దార్లు పేర్లుతో నకిలీ పొజిషన్ సర్టిఫికెట్లను కూడా తయారు చేస్తున్నట్లు ప్రచారంలో ఉంది. నకిలీ సీళ్ళు వీరి వద్ద నిల్వ ఉంచుకున్నట్టు బయట ప్రచారం జరుగుతోంది.అన్ లైన్ సేవలు ఉన్నప్పటికీ దస్తూరి పేరిట రిజిస్ట్రేషన్ చలనాలు పేరిట, ఇసి పేరిట ప్రజలు నుంచి అక్రమంగా 10 రెట్లు సొమ్మును వసూళ్లు చేసి ప్రజలకు మోసగిస్తున్నారు.సబ్ రిజిస్ట్రారు కార్యాలయానికి ఈ దందా తెలిసినా మౌనం దాల్చుతూ..వాటాలు పొందడం తో లేఖర్లు, దళారులు ఎటువంటి శ్రమ లేకుండ నెలకు ఒక్కక్కరు మూడు లక్షలు రూపాయలు వరకు అర్జిస్తున్నారంటే ఇక్కడ దోపిడీ ఏ స్థాయి లోఉందో అర్థం చేసుకోవచ్చు. తక్షణమే ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆర్థిక దోపిడీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రికార్డులు నిర్వహణ సక్రమంగా చేపట్టాలి

విశాలాంధ్ర - మందస : కార్యాలయం రికార్డులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా పరిషత్ సీఈవో ఎల్ ఎన్ వి శ్రీధర్ రాజా అన్నారు. మంగళవారం మందస మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయంలో సిబ్బంది పని తీరును సమీక్షించారు. కార్యాలయంలో రికార్డు నిర్వహణపై తగు సూచనలు అందించారు. అనంతరం మందసలోని శ్రీ వాసుదేవ్ పెరుమాళ్ 16 వ బ్రహ్మోత్సవాలు జరుగుతున్న సందర్భంగా స్వామి వారి దర్శనం చేసుకున్నారు. ఆయనతో పాటు మందస మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎన్.రమేష్ నాయుడు, పరిపాలనాధికారి బి.ఋషేశ్వరరావు, గ్రామ పంచాయతీ నిర్వహణాధికారి బి.నవీన్ కుమార్, మరియు మండల ప్రజా పరిషత్ సిబ్బంది ఉన్నారు.

కూలీలకు ఉపాధి పనులు కరువు

విశాలాంధ్ర - మందస : మండలంలో పలు పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం క్రింద ఉపాధి పనులు ఇంతవరకు ప్రారంభం కాలేదు. దీంతో వేలాది మంది ఉపాధి కూలీలు ఆందోళన చెందుతున్నారు. ఆరు బయట కూలీ పనులు లభ్యం కాక ఉపాధి కూలీ పనులు లేక కూలీల కుటుం బాలకు జీవనోపాధి కరువు అయింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి మందస మండలం లో మందస మేజర్ పంచాయతీ తో పాటు సరియాపల్లి, బేతాలపురం, పొత్తంగి పంచాయతీల్లో ఇటీవల పలు రకాల ఆరోపణలు పై ఆరుగురు ఫీల్డ్ అసిస్టెంట్లును ఉన్నతాధికారులు సస్పెండ్ చేసారు. ఈ పంచాయతీల్లో ప్రత్యామ్నాయంగా ఇన్చార్జి బాధ్యతలు ఎవరికీ అప్పగించారో బయటకు తెలియడం లేదు. సస్పెండ్‌కు గురైన ఫీల్డ్ అసిస్టెంట్లు పంచాయతీల్లో ఉపాధి పథకం పనులు పూర్తిగా జరగడం లేదు. ప్రతి ఏడాది సంక్రాంతి పండుగ ముగిసిన తరువాత ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభించేవారు. కానీ ఇంత వరకు పనులు ఈ పంచాయతీల్లో ప్రారంభిచకుండా కాల యాపన చేయడం పట్ల పలు అను మానాలకు తావిస్తుంది. ఉపాధి పథకం పనులు ప్రారంభం కాక వేలాది మంది ఉపాధి కూలీలు ఉపాధి లేక రోడ్డున పడ్డారు. ఆర్థిక పరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపాధి పథకం పనులు లేక తీవ్రంగా నష్ట పోతున్నారు. ఉపాధి పథకం ద్వారా జరగాల్సిన అభివృద్ధి పనులన్ని నిలిచి పోయాయి ఈ విషయంపై ఉపాధి ఎపిఓ హరికృష్ణను వివరణ కోరగా ఉపాధి పనులు ప్రారంభించడానికి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తున్నామని పక్కా పంచాయతీల్లో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు ను ఇన్చార్జిలుగా నియమించి పనులు ప్రారంభిస్తామని సమాదానం ఇచ్చారు.

మోహన్‌బాబు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

22 మంది రక్తదాతలకు సన్మానించిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

విశాలాంధ్ర - నరసన్నపేట : మండలంలోని చోడవరం గ్రామంలో మంగళవారం మోహన్‌బాబు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శ్రీకాకుళంకు చెందిన రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో సుమారు 22మంది దాతలు రక్తాన్ని సొసైటీకి దానం చేశారు. వీరందరికీ దుశ్శాలువలతో సన్మానం చేసి, ప్రశంసా పత్రాలు అందచేశారు. అలాగే గ్రామంలోని శ్రీ శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవం నరసన్నపేటకు చెందిన విశ్వహిందూ పరిషత్, రణస్థలంకు చెందిన ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. అంతేకాక 60సంవత్సరాలు పూర్తి చేసుకున్న సుమారు 70మంది దంపతులకు సామూహికంగా షష్ఠి పూర్తి కార్యక్రమంలో ఎమ్మెల్యే, రమణమూర్తి పాల్గొని, వారందరినీ ఘనంగా సన్మానం చేసి, వారి ఆశీస్సులను తీసుకోవటం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, అడపా శ్రీధర్, అడపా చంద్రశేఖర్, రజనీకాంత్, రవి, వేణు, గోపి, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు, లోకనాథం ఆనందరావు, సభ్యులు, టంకాల సూరప్పడు, భాస్కరభట్ల జగదీష్ శర్మ, వారణాశి సంతోషి, తమ్మిరి కరుణశ్రీ, రెడ్‌క్రాస్ సొసైటీ వైద్యులు, డా.శ్రీకాంత్, మేనేజర్, సత్యన్నారాయణ, ప్రతినిధులు, శ్రీకాంత్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఫిష్ పాండ్ పరిశీలించిన డ్వామా పీడీ

విశాలాంధ్ర - ఆమదాలవలస : మండలంలోని కే.మునగవలస పంచాయతీలోని రాజన్న ఫిష్ పాండ్ ను డ్వామా పిడి బి.సుధాకరరావు మంగళ వారం పరిశీలించారు. ప్రభుత్వం నిర్దే శించిన వేతనం వేతనదారులకు అందేలా మార్కింగ్ చేయాలని అలాగే అందరికీ పని కల్పించే విధం గా చూడాలని ఆదే శించారు. మండలంలో జరుగు తున్న ఉపాధి పనులపై మండల ఉపాధి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబం ధనల మేరకు ఇచ్చిన కొలతలు ప్రకారం పనులు పూర్తిచేసి వేతనదారులకు వేతనాలు అందేలా చూడాలని ఆదేశించారు. వేతన దారులతో సమ న్వయం చేసుకుంటూ లక్ష్యాలు మేరకు కూలీలకు ఉపాధి కల్పించాలని సూచించారు. విధి నిర్వ హణలో అంకిత భావం ఉండాలన్నారు. ఉపాధి పనులు పరిశీలనలో పీడీతో పాటు మండల ఉపాధి సిబ్బంది ఉన్నారు.

సమగ్ర అభివృద్ధికి పాటు పడాలి

విశాలాంధ్ర - నందిగాం : అంగన్వాడీ కేంద్రాలకు వచ్చిన పిల్లల సమగ్ర అభివృద్ధికి కార్యకర్తల పాటు పడాలని ఆ శాఖ టెక్కలి సహాయ ప్రాజెక్టు అధికారిని ఉమామహేశ్వరి అన్నారు. స్థానిక అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల కళాశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో అంగనవాడి కార్యకర్తలకు మంగళవారం జరుగుతున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లా డారు. ఈ శిక్షణ కార్యకర్తల్లో నూతన ఉత్తేజం తీసుకువస్తుందని అభిప్రాయపడ్డారు. అంతకు ముందు ఎంఈఓ 1, 2 జీ.నరసింహులు, చిన్నారావులు సంయుక్తంగా శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

శిథిలావస్థకు చేరిన వంశధార కాలువలపై వంతెనలు

విశాలాంధ్ర - జలుమూరు : దశాబ్దాల క్రితం వంశర ప్రధాన ఎడమ కాలువలపై నిర్మించిన వంతె శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలు భయాందోళన చెందు తున్నారు. సుమారు 45 సంవత్సరాల క్రితం నిర్మించిన వంతెనలు పూర్తిగా శిథిలావస్థ చేరి పోవడంతో ఏ క్షణా కూలిపోతాయే మోనని ప్రయాణికులు ప్రజలు ఆందోళన చేస్తున్నారు. గొట్టా బ్యారేజ్ నుండి జలుమూరు మండలం చివరి వరకు 6 వంతెనలు ఇటువంటి పరిస్థితుల్లో ఉన్నాయని ఆ ప్రాంత ప్రజలు తెలిపారు. కిట్టాలపాడు, గుమ్మ పాడు, కిన్నెర వాడ, సుబ్రహ్మణ్యపురం, తమ్మయ్యపేట, రాణ పలు గ్రామాల్లో ఇదే పరిస్థితిలో ఉన్నాయని వీటిని తొలగించి కొత్తవంతులు నిర్మాణాలు చేస్తే మరికొన్ని దశాబ్దాలు పాటు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉంటాయని పలువురు కోరుతున్నారు.

ఆదాయ అభివృద్ధిపై మహిళా సంఘాలు దృష్టి పెట్టాలి

డీపీఎం నాగలక్ష్మి

విశాలాంధ్ర - పోలాకి : ఆదాయ అభివృద్ధిపై లాభాలు వచ్చేలా ప్రతీ ఒక్కరూ దృష్టి పెట్టాలని జిల్లా డిపిఎంఎ నాగలక్ష్మి అన్నారు. మంగళవారం పోలాకి వెలుగు కార్యాలయంలో ఆమె మహిళా సంఘాలతో సమా వేశ మయ్యారు. ఈ సందర్భంగా డిపిఎం నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లా పిడి ఆదేశాల మేరకు 13 వందల గ్రామ సంఘాలుకు గాను జిల్లా టార్గెట్ 1,8861 ఇచ్చినట్లు తెలిపారు. మండలంలో 6.649 మందికి హెూమ్ కిచెన్ గార్డెన్స్ గుర్తించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎసి కొండలరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కిచెన్ గార్డెన్స్ ఇంటిముందు పెంచుకోవాలని అగ్రికల్చర్ డిపార్మెంట్ సహకారంతో మహిళా సంఘాల్లో ఉన్నటువంటి వ్యవసాయదారులకు సేవ్ సెంటర్ కార్యక్రమాలు ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు వివరించారు. ఆదాయం వచ్చే పంటలు పండించిన వారికి అనుకూలమైన సబ్సిడీలు కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రాజారావు, సీసీలు పద్మావతి, ధనలక్ష్మి, జానకి, దుర్గ, సి ఎఫ్ లు పాల్గొన్నారు.

బాల్యం నుండే చిన్నారులకు అక్షరాలు నేర్పాలి

విశాలాంధ్ర - కవిటి : అంగన్వాడీల్లో ఉన్న చిన్నారులకు బాల్యం నుండే పీపీ1పుస్తకాల్లో ఉండే బొమ్మలు ద్వారా అక్షరాలు నేర్పించాలని ఎంఈవో ధనుంజయ మజ్జి అన్నారు. ఈ మేరకు మంగళవారం కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీలకు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ ఆరు రోజుల పాటు ఉంటుందని, శిక్షణలో నేర్చుకున్న అంశాలు అంగన్వాడీ కేంద్రాల్లో అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు పల్లవి, లక్ష్మీ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుకు ఐడీ నెంబరు తప్పనిసరి

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని ప్రతీ రైతు ఫార్మర్ ఐడీ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయాధికారి బి.దుర్గాప్రసాద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జగతి రైతు సేవా కేంద్రంలో చేపడుతున్న రిజిస్ట్రేషనను పరిశీలించారు. ఐడీ ఉన్న రైతులకు మాత్రమే ఈసారి పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, రాయి తీపై విత్తనాలు, ఎరువులు, బ్యాంకు రుణాలు, ఇతర పథకాలు అందుతాయని తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో 3977 మంది రైతులు ఐడీ కోసం రిజి స్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్య క్రమ ంలో ఏఈవోలు శ్రీకళ్యాణ్, రైతులు పాల్గొన్నారు.

ఎన్పీసీఐఎల్ ఆధ్వర్యంలో అణుశక్తి అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర - శ్రీకాకుళం : అణుశక్తి యొక్క వివిధ ఉపయోగకరమైన అంశాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ఎన్పీసీఐఎల్ ఆధ్వర్యంలో ఆటమ్ ఆన్ వీల్" పేరిట మొబైల్ ఎగ్జిబిషన్ ద్వారా ప్రత్యేక ప్రచారం విజయ వంతంగా జరిగినట్టు నిర్వాహకులు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో గత ఏడాది నవంబర్ 13న ప్రారంభించబడిందన్నారు. నవంబర్, డిసెంబర్, 2024 జనవరి, 2025 సహా గత 3 నెలల్లో ఈ వినూత్న ప్రచారం ద్వారా దాదాపు 64755 మందికి అణుశక్తి గురించి సమాచారం అందించబడిందన్నారు. ప్రత్యేక అంశాలు సృజనాత్మక విధానంతో, ఈ ఎగ్జిబిషన్ శ్రీకాకుళం విజయనగరం జిల్లాలోని 15 కంటే ఎక్కువ మండలాల్లోని సుమారు 139 గ్రామాల పాఠశాలలు, కళాశాలలు, కమ్యూనిటీ మార్కెట్లు మొదలైన వాటిని సందర్శించడం ద్వారా విద్యార్థులు, వివిధ రంగాలకు చెందిన సాధారణ ప్రజలను విజయవంతంగా అవగాహన కల్పించిందన్నారు. జనవరి చివరి నుంచి ఫిబ్రవరి 12 వరకు, శ్రీకాకుళం, విజయనగరం పార్వతీపురం మన్యం జిల్లాలోని 71 గ్రామాలలో అణుశక్తి యొక్క సామాజిక ఉపయోగాల గురించి సుమారు 12904 మందికి సమాచారం అందించబడిందని తెలిపారు.

వార్డులలో పర్యటించిన కమిషనర్

విశాలాంధ్ర - ఆమదాలవలస : పురపాలక పరిధిలోని పలు వార్డులలో మంగళ వారం తెల్లవారుజామున మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ పర్యటించి తాగు నీటి నాణ్యత లను పరిశీలించారు. అలాగే ప్రధాన రహదారిపై జరుగుతున్న శానిటేషన్ పనులను కూడా పరిశీలించారు. అమ్మ ఫంక్షన్ హాల్, రైల్వే స్టేషన్, గేటు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా పరిశీలించి క్లోరినేషన్ చేయించారు. రోజు వస్తున్న నీటిని, వార్డులలో అందుతున్న విధానాన్ని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వేసవికాలం నీటి వృదా అరికట్టాలని తెలిపారు. పాత ఆముదాల వలస వరకు తాగునీరు అంతే విధానాన్ని పరిశీలించారు. నీటి చౌర్యం కు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వార్డుల పర్యటనలో భాగంగా శానిటేషన్ పనులు నిర్వహణ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు చెత్త పోగులను తొలగించాలని ఆదేశించారు. స్వచ్ఛత లో భాగంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే విధం గా చూడాలన్నారు. ఆయనతోపాటు వార్డు సచి వాలయ శానిటేషన్ అధికారులు ఉన్నారు.

అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాలు పరిష్కరించాలి

ప్రముఖ వైద్యులు, సామాజిక కార్యకర్త డా. జీవీ

విశాలాంధ్ర - పలాస : దశాబ్దాలుగా ఒడిస్సా ఆంధ్ర నదీ జలాల వివాదాలు కొనసాగుతున్నాయని వాటిని పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రముఖ వైద్యులు, సామాజిక కార్యకర్త డా. దువ్వాడ జీవితేశ్వర రావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1936కు ముందు ఒకే ప్రాంతంగా ఉన్న నాటి కళింగ సీమను ఒరిస్సా రాష్ట్రం గాను, ఉత్తరాంధ్ర గాను అశాస్త్రీయంగా విడదీసి ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం చేశారని వాపోయారు. నిజానికి మహానది నుండి గోదావరి నది వరకు గల ప్రాంతం 1936 వ సంవత్సరం వరకు కళింగ సీమగా కొనసాగిందని, ఈ ప్రాంతం లోని ఆచారాలు, సంస్కృతి సాంప్రదాయాలు ప్రాచీన కాలం నుండి కొనసాగేవని గుర్తు చేశారు. 1936లో కుట్ర, కుతంత్రాలతో ఒకే ప్రాంతంగా ఉన్న కళింగసీమను ఇలా రెండు ప్రాంతాలుగా విడదీసి, ఉత్తరాంధ్రను ఉత్తుత్తి ఆంధ్ర గా పాలకులు వెనుకబాటు తనానికి గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర వాసులు కళ్ళ ముందే పడుతున్న వర్షపు నీటిని కూడా వాడుకోవడానికి వీలు లేకుండా అంతర్ రాష్ట్ర నదీ జలాల వివాదంలో ఉత్తరాంధ్ర కూరుకు పోయిందని ఎన్నో దశాబ్దాల గడుస్తున్నా నేటికీ ఒరిస్సా ఉత్తరాంధ్రల మధ్యన ఉన్న అంతర్ రాష్ట్ర నదీ జలాల వివాదం సమస్య పోలేదని, పరిష్కారం కుదరలేదన్నారు. ఇది కేవలం వెనకకు నెట్టబడిన ఉత్తరాంధ్ర పట్ల పాలకులకు చిన్న చూపు వలన గత ప్రభుత్వంలో ఒరిస్సా ముఖ్య మంత్రి నవీన్ పట్నాయక్‌తో గత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ వివాదంపై చొరవ తీసుకొని సంప్రదింపులు జరిపారన్నారు. ప్రస్తుతం కేంద్రంలో కూటమి ప్రభుత్వంకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సహకారం అందిస్తుందని అన్నారు. ఒరిస్సా రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం ఏలుతుందని ఒరిస్సా రాష్ట్ర గవర్నర్ విశాఖకు చెందిన తెలుగువారు మాజీ ఎంపీ కంభంపాటి హరిబాబు చొరవ చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఇన్ని అనుకూల పరిస్థితులు ఉన్న ప్రస్తుత తరుణంలో రాష్ట్రంలోని పాలకులు చొరవ తీసుకొని ఒరిస్సా ఆంధ్ర అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదం పరిష్కరించాలని కోరారు.

ఆ షాపు స్థలం.. అమ్మకానికి సిద్ధం..?

పలాస కాశీబుగ్గలో సంచలనం రేపిన విశాలాంధ్ర కథనాలు

విశాలాంధ్ర - పలాస : పలాస కాశీబుగ్గ కేటి రోడ్ లో గల'అ షాప్ ఎవరిది' కేటీ రోడ్డులో 'షాప్ స్థలంకు వారసుడు ఎవరు'..? అనే శీర్షికలతో విశాలాంధ్రలో ప్రచురితమైన కథనాలు జంట పట్టణాల్లో సంచలనం రేపింది. కోట్లాది రూపాయలు విలువ చేసే షాపు స్థలంను కాజేసేందుకు ప్రయత్నిస్తున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. బినామీ హక్కుదారులతో ఈ షాపు స్థలంను పలాసకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఒకరు కాశీబుగ్గ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవడం సంచలనం సృష్టించింది. తప్పుడు సర్వే నెంబర్ తో ఎలా రిజిస్ట్రేషన్ చేసుకున్నారనేది శేష ప్రశ్నగా మిగిలింది. ఈ షాపు స్థలం తనదని కాశీబుగ్గ సూది కొండ ప్రాంతంలో నివాసం ఉంటున్న నెయ్యల రామారావు కుమారుడు రాజు పిత్రార్జితం ఆస్తి అంటూ పలాసకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారికి రిజిస్ట్రేషన్ చేసేశారు. ఆ షాపు తమదని, తామే కొనుగోలు చేసుకున్నామని ఆ వ్యాపారి బాహాటంగా అమ్మకానికి పెట్టేశారు. పలాసకు చెందిన వ్యాపారికి కోటి యాభై లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టే స్థోమత లేదని, ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న ఆయన వెనుక కొన్ని రాజకీయ శక్తులు పనిచేస్తున్నాయని ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన ఒక వార్డు ఇన్చార్జి వెనుక ఉండి నడిపిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇది ఇలా ఉండగా షాపు స్థలం నిజమైన హక్కుదారుడు ఖరగ్ పూర్ నివాసి అని తెలుస్తోంది. 2016లో ఆయన మృతి చెందాడని ప్రచారం జరగడంతో షాపు ముందు అద్దెకు టీ దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్న నెయ్యల రామారావు నెల నెల అద్దె చెల్లిస్తుండేవాడు. కొంత మంది రాజకీయ నాయకుల సలహా మేరకు పిత్రార్జితం ఆస్తిగా వారసత్వంగా వచ్చిందని కొడుకు రాజు పేరున 2023లో కాశీబుగ్గ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సెటిల్మెంట్ రిజిస్ట్రేషన్ చేశాడు. ఈ విషయం తెలుసుకున్న స్థలంకు చెందిన హక్కుదారులు గతంలో కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారని సమాచారం. రాజును పోలీసులు ప్రశ్నించే సమయంలో వజ్రపుకొత్తూరు మండలం డోకులపాడు కు చెందిన మాజీ సర్పంచ్ పోలీసులకు రాజు తమ వాడని విడిచి పెట్టేయండి అని కోరినట్లు తెలుస్తోంది. ఇది ఇలా ఉండగా షాపు స్థలం నిజమైన హక్కుదారుడు మృతి చెందలేదని మతి స్థిమితం కోల్పోయి సజీవంగానే ఉన్నారని తెలుస్తోంది. షాప్ స్థలంకు సంబంధించి అసలైన డాక్యుమెంట్ల తో హక్కుదారులు త్వరలో పలాస చేరుకుని తమకు జరిగిన అన్యాయంను నిలదీసేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం. ఇది ఇలా ఉండగా అదే షాప్ స్థలంకు సంబంధించి మున్సిపాలిటీకి చెందిన ఒక కౌన్సిలర్ నిజమైన హక్కు దారులతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ప్రచారం జరుగుతోంది. 1968 లింక్ డాక్యుమెంట్ ప్రకారం ప్రస్తుతం ఉన్న హద్దులు అప్పటి హద్దులు సరిపోవడంతో తాను కొనుగోలు చేసుకున్నట్లు కౌన్సిలర్ స్పష్టం చేస్తున్నారు. ఖరగ్ పూర్ వాసికి దశాబ్దాల కిందట ప్రముఖ బంగారం వ్యాపారి పెంట దాలయ్య సహకారంతో కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. అప్పటి డాక్యుమెంట్లలో పెంట దాలయ్య సాక్షి సంతకం పెట్టినట్లు ఉందని సమాచారం. స్థలాన్ని కొనుగోలు చేసిన కౌన్సిలర్ కు పెంట దాలయ్య కుమారుడు పెంట శివానంద సహకారం అందించడంతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ప్రస్తుత డాక్యుమెంట్లో శివానంద్ సాక్షి సంతకం పెట్టినట్లు తెలుస్తోంది. శివానంద దగ్గర ఉండి షాపు స్థలం కౌన్సిలర్ కొనుగోలు చేసేందుకు సహకరించినట్లు బోగట్టా. కాగా టీ కొట్టు యజమాని పలాస రియల్ వ్యాపారికి ఏ డాక్యుమెంట్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేశారో తెలియాల్సి ఉంది. ఆ వ్యాపారి కూడా తాను కొనుగోలు చేసిన షాప్ స్థలం తనకే చెందుతుందని బల్ల గుద్ది మరీ చెబుతున్నారు. వీరిద్దరిలో ఆ స్థలం ఎవరికి చెందుతుందో వేచి చూద్దాం. అయితే కేటీ రోడ్ లో అతి ముఖ్యమైన ప్రాంతంలో గల ఈ షాపు స్థలం కైవసం చేసుకునేందుకు కోట్ల రూపాయలు గుమ్మరించి తమది చేసుకోవాలని చాలా మంది బడా వ్యాపారులు ఉవ్విళ్ళూరుతున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ఎవరిదో షాపు స్థలంను ఇంకెవరో తన్నుకుపోయేందుకు రాబందుల్లా తిరుగుతున్నారనేది నగ్న సత్యం.

డివిజన్ పరిధిలో 8000కు పైగా రీసర్వే ఫిర్యాదులు

ఆర్డీవో సాయి ప్రత్యూష

విశాలాంధ్ర - పొందూరు : గత ప్రభుత్వంలో నిర్వహించిన భూముల రీసర్వేలో జరిగిన తప్పిదాలపై నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్పరిధిలోని మండలాల నుంచి 8000కు పైగా ఫిర్యాదులు వచ్చాయని శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష తెలిపారు. మండలం దళ్ళవలస రెవెన్యూ గ్రామానికి సంభందించి వచ్చిన రీసర్వే ఫిర్యాదులపై వీఆర్వోలు, సర్వేయర్లతో మంగళవారం సమీక్ష' నిర్వహించారు. డివిజన్లో వచ్చిన ఫిర్యాదులలో ఎక్కువ ఫిర్యాదులు పొందూరు, ఆమ దాలవలస, ఎచ్చర్ల మండలాలనుంచే వచ్చాయని తెలిపారు. ఫిర్యాదుదారులకు నోటీసు లు అందించి చేసిన ఫిర్యాదుమేరకు భూసమస్యను పరిష్కరించేలా చూడాలని తహసీ లార్ వెంకటేష్ రామానుజులకు సూచించారు. పొందూరు మండలానికి సంభందించి వచ్చిన పిర్యాదులు పరిష్కరించేందుకు రాత్రులు, సెలవుదినాలలో సిబ్బందితో పనిచేస్తున్నామని ప్రతీ ఫిర్యాదుకు సంభందించిన సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ చె ప్పారు. కొంతమంది రైతులు నోటీసులు ఇచ్చినా స్పందించడంలేదని, స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకుల సహకారంతో పరిష్కరిస్తామన్నారు. దళ్ళవలసలోనే ఎక్కువ ఫిర్యాదులు ఉన్నాయని, వీఆర్వో లేకపోవడంతో ఫిర్యాదలు పరిష్కరించేందుకు ఇబ్బంది వస్తోందని సచివాలయ కార్యదర్శి జగదీష్, గ్రామస్తులు ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. వీఆర్వోను నియమించి ఫిర్యాదులు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నోటీలకు స్పందిం చిన రైతుల సమస్యలన్నింటినీ 5 రోజులలోగా పరిష్కరించాలని తహసీల్దారు ఆర్డీవో సాయి ప్రత్యూష ఆదేశించారు.

కొలతల ప్రకారం పనిచేస్తేనే గిట్టుబాటు కూలి : ఏపీడీ లోకేష్

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : సిబ్బంది ఇచ్చిన కొలతలు ప్రకారం పని చేస్తేనే ఉపాధి హామీ పథకం కూలీలకు వేతనం గిట్టుబాటు అవుతుందని ఏపీడి కే లోకేష్ స్పష్టం చేశారు. మంగళవారం బాంతలకోడూరు చెరువు పనులను పరిశీలించిన ఆయన అక్కడ ఉన్న కూలీలతో మరియు గ్రామస్తులతో మాట్లాడుతూ వేతన దారులు పని ప్రదేశంలో రెండు పూటలా ఎనిమిది గంటల సమయం పనిచేయాలని లేనట్లయితే గరిష్ట వేతనం అందే అవకాశం లేదని తెలియజేశారు. వేసవి నేపథ్యంలో ఉదయం సాయంత్రం చల్లని సమయాల్లో పనిచేయాలని సూచించారు. నాణ్యతతో కూడిన పనులు చేయడం ద్వారా మీ గ్రామానికి సుస్థిర ఆర్థిక వనరులు ఏర్పడడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులు అధికంగా వస్తాయని భూగర్భ జలమట్టం కూడా పెంపొందడం వల్ల పంటల్లో నాణ్యత ఉంటుందన్నారు. అనంతరం ఇప్పటి వరకు చేసిన పనులను ఏపీడీ సిబ్బందితో కొలిపించి వేతనం గిట్టుబాటు అంశానికి సంబంధించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏపీడీ వెంట ఏపీఓ శోబాదేవి, ఈసీ నారాయణమ్మ, టిఏలు ప్రభాకర్, సురేష్, టీవీ రమణ, మణికంత, తదితరులు ఉన్నారు.

కృష్ణా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్‌గా మండల వాసి

విశాలాంధ్ర - పొందూరు : మండలం పెనుబర్తి గ్రామానికి చెందిన కూన రామ్ విజయ వాడలోని కృష్ణా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రాష్ట్రంలో పలు యూనివర్శిటీలకు వైస్ఛ చాన్సలర్లను నియమించింది. కృష్ణా యూని వర్సిటీకి రామ్జీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసారు. గతంలో రామ్జీ ఎచ్చర్లలోని అంబేద్కర్ యూనివర్సిటీ వీసీగా సమర్థ వంతంగా పనిచేసి పేరు తెచ్చుకున్నారు. రామ్జీ పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు స్వయానా సోదరుడు, రవి కుమార్కు చిన్నాన్న కుమారుడు. రామ్జీ నియామం పట్ల పెనుబర్తి గ్రామస్తులతో పాటు ఎంఎల్ఏ రవికుమార్, కూన సత్య నారాయణ, కూన ప్రమీల, మండల పార్టీ అధ్యక్షులు సీహెచ్ రామ్మోహన్, బాడాన శేషగిరి నాయుడు హర్షం వ్యక్తం చేసారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఎన్ఈఆర్



విశాలాంధ్ర - ఎచ్చెర్ల : నియోజవర్గం లావేరు హెడ్ క్వార్టర్స్‌కి చెందిన ఉప్పు పావలు బ్రెయిన్ సర్జరీ జరిగి కోలు కుంటున్న ఆమెకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 1,57,000 రూపాయల చెక్కు ను మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శాసన సభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) కూటమి నాయ కుల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది మంది పేద, మధ్య తరగతి ప్రజలకు యేటా సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూత నందించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలో చాలా మంది పేదలకు వైద్య సేవల కోసం సీఎం సహాయనిధి ద్వారా చెక్కులు అందించినట్లు తెలిపారు.

సచివాలయ సిబ్బంది సమయం పాటించండి

విశాలాంధ్ర - జలుమూరు : గ్రామస్థాయిలో పనిచేసే సచివాలయ సిబ్బంది ప్రభుత్వ సమయాలు పాటించాలని మండల అభివృద్ధి అధికారి పివి విమోహన్ కుమార్ అన్నారు. సారవకోట మండలం బుడితి సచివాలయాన్ని మంగళవారం ఉదయం సందర్శించారు. గ్రామ రెవెన్యూ అధికారి మినహా ఇతర సిబ్బంది హాజరు కాకపోవడంతో ఆయన ఆయుర్వేదన వ్యక్తపరిచారు. స్థానిక ఉద్యోగుల వలె పదిన్నర కాకుండా సచివాలయ సిబ్బంది 10 గంటలకు హాజరు అవ్వాలని సూచించారు.

సోంపేట-కంచిలి రోడ్డు ప్రయాణం నరకం!

- మరమ్మతులకు నోచుకోని వైనం

- చేతులెత్తేసిన అధికార గణం

విశాలాంధ్ర - సోంపేట : సోంపేట, కంచిలి రోడ్లపై ప్రయాణం అంటే ప్రజలు హడలెత్తిపోతున్నారు. రోడ్లపై ఎక్కడ చూసినా భారీగోతులు... ఇష్టానుసారంగా స్పీడు బ్రేకర్లు... ఎక్కడికక్కడే తేలిపోయిన రాళ్లు... వీటిని దాటు కుంటూ ప్రయాణించడమంటే వాహన చోదకులకు ఇక్కడే నరకం కనిపిస్తోంది. అటు అధికారులు గాని, ఇటు ప్రజాప్రతినిధులు గాని అధ్వాన్నంగా ఉన్న రోడ్ల పట్ల కనీసం పట్టించుకోకపోవడంతో ప్రజలు విపరీతంగా విమర్శలు గుప్పిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటనలు మాత్రమే మిగిలాయి తప్పా పనులు మాత్రం ఎక్కడా పూర్తయిన దాఖలాలు లేవు. గ్రామీణ ప్రాంతాల్లో అరకొరగా మరమ్మతులు తప్ప సోంపేట, కంచిలి మండల కేంద్రాల్లో ప్రతిరోజు వేలాది మంది తిరుగాడే రోడ్లుకు మోక్షం లేకపోవడం సర్కారు చిత్తశుద్ధికి నిదర్శనం. నియోజకవర్గంలో మంజూరైన రోడ్లు మరమ్మతు పనుల్లో 30 నుంచి 40 శాతం పూర్తి చేసినప్పటికీ వాటికి సంబంధించిన బిల్లులు చెల్లింపులు లేకపోవడంతో కాంట్రాక్టర్లు మిగతా పనుల జోలికి వెళ్లడం లేదని తెలుస్తోంది. దీంతో అధ్వాన్నపు రహదారులపై ప్రయాణించడం ప్రయాణీకులకు ప్రాణ సంకటంగా మారుతోంది. బస్సులు, లారీలు, కార్లు నడిపే డ్రైవర్లు తీవ్ర అసహనానికి గురౌతున్నారు. కంచిలి మండల కేంద్రం పరిశీలిస్తే సోంపేట వైపునున్న ఫ్లైఓవర్ మొదలుకుని మఠం కంచిలి, స్టేట్‌బ్యాంక్ ఏరియా, రైల్వేస్టేషన్, కంచమ్మ ఆలయం గేటు, శివాలయం, పెట్రోలు బంకు, కేశవయ్య దాబా హెూటల్ వరకు కంచిలి మెయిన్‌రోడ్డు పరిస్థితి అత్యంత ఘోరంగా ఉంది. ఆర్టీసీ బస్సులు, ఒడిశా వెళ్లే ప్రైవేటు బస్సులు రహదారి గుండా వెళ్లేందుకు సాహసం చేయలేక బైపాస్‌లో వెళ్లిపోవడం గమనార్హం. సోంపేటలో మెయిన్‌రోడ్డు సైతం తానేమీ తక్కువ కాదన్నట్లు ప్రతిచోట గోతుల మయమై ప్రయాణీకుల సాహసానికి పరీక్ష పెడుతుంది.

పరిస్థితి అధ్వాన్నంగా ఉండడంతో సంబంధిత శాఖాధికారులు స్పందించకపోవడంతో రోడ్డు భద్రత వారోత్సవాలు సందర్భంగా సోంపేట సీఐ మంగరాజు స్వయంగా రోడ్ల గోతులు రాళ్లు, ఇసుక పోసి కప్పించడం ఆయన సేవానిరతికి నిదర్శనం. గత ప్రభుత్వ పాలనలో రోడ్ల నిర్వ హణకు నిధులు విదిల్చకపోగా ఇప్పటి సర్కారు సైతం అదే నిర్లక్ష్యాన్ని చాటుకుంటుందని బహిరంగంగా ప్రజలు విమర్శిస్తున్నారు. రోడ్లు అధ్వాన్నంగా మారడంతో ప్రమాదాలు అధికమవుతున్నాయని అందరూ ఆందోళన చెందుతున్నారు. సోంపేట ఆర్అండ్‌బి సబ్ డివిజన్ అధికారులు మాత్రం తామేమీ చేయలేమంటూ చేతులెత్తేయడం కొసమెరుపు.